ప్రజాశక్తి
మంగళవారం 05 నవంబర్ 2024
5
కర్నూలు

రాస్తారోకోలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

జిల్లా వెనకంజలో ఉంది

• సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి దృష్టి • ఇసుక రీచ్‌లను పెంచాలి
• ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు • నియోజకవర్గ సమస్యలను లేవనెత్తిన ఎమ్మెల్యేలు

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా అన్నింటిలోనూ వెనుకంజులో నిలిచిందని జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడుతుందన్నారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధి మండలి సమావేశం జరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుండి ప్రారంభమై దాదాపుగా మూడు గంటలకు పైగానే సమీక్షించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి టిజి. భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, కెఇ. శ్యాంబాబు, పార్థసారథి, వీరుపాక్షి, బొగ్గులదస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి లతోపాటు పలువురు పాల్గొన్నారు. ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ కర్నూలు జిల్లాల్లో 8 లక్షల ఎకరాలు ఉండగా అందులో 20 శాతం ఆయకట్టు కు సాగునీరు అందని పరిస్థితి ఉందన్నారు. రిజర్వాయర్ లను ఏ విధంగా పూర్తి చేయాలి, కర్నూలు జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. ఉల్లి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. 2022లో గత ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు సంబంధించి సర్వేకు అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు. తాము ప్రజల ఆమోదం లేకుండా ఏ పనీ చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో లాగా ఈ ప్రభుత్వంలో వేధింపులు అక్రమ అరెస్టులు ఉండవని, ప్రజల సంక్షేమం కోసమే తాము పని చేస్తామని మంత్రి పేర్కొన్నారు. హంద్రీ నీవా మీద రూ.2800 కోట్లు ఖర్చు పెట్టి హంద్రీ నీవా ద్వారా ప్రస్తుతం వస్తున్న 1800 క్యూ సెక్కుల నీటి నుండి 3 వేల 850 క్యూ సెక్కులకు నీరు వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. హంద్రీ నీవా మెయిన్ కెనాల్ లో నీరు ఎప్పుడైతే రెట్టింపు వస్తుందో, హంద్రీ నీవా మీద ఆధారపడిన వంటి కర్నూలు, అనంతపురం, సత్యసాయి, హిందూపురం,చిత్తూరు జిల్లాలకు కూడా ఉపయోగం ఉంటుందన్నారు. వేదవతి, గుండ్రేవుల, సుంకేసుల, ఆర్‌డిఎస్, పందికోన, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ తదితర ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో ఒకటి తర్వాత ఒకటి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత ఇసుక విధానానికి సంబంధించి ఎన్ని రీచులకు అనుమతులు పెట్టారు?? అవి ఏ స్టేజ్ లో ఉన్నాయి ?? అవి ఎప్పుడు ఆపరేషన్‌లోకి వస్తాయని మంత్రి గనుల శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎవరైనా సెక్రెటరీ సంతకంతో సొంత పనుల కోసం ఎడ్ల బండ్ల మీద ట్రాక్టర్ల మీద ఇసుకను తీసుకొని వెళ్తే పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఆపకూడదన్నారు. అలా ఆపితే అధికారుల మీద చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇసుక రీచ్‌లను కూడా పెంచేందుకు దృష్టి సారించాలని పేర్కొన్నారు. అలా కాకుండా అక్రమంగా ఇసుక ఎవరైనా తరలిస్తే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఎస్‌పిని ఆదేశించారు. వేల కోట్లు తీసుకొని నిధులను డైవర్ట్ చేశారని మంత్రి విమర్శించారు. టిజి.భరత్ మాట్లాడుతూ పశుసంవర్ధక, మార్కెటింగ్, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన పథకాల గురించి సోషల్ మీడియాలో, సిటి కేబుల్ ఛానల్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గ పరిధిలోని సమస్యలను ఆయా నియోజకవర్గ పరిధిలోని సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకువచ్చారు. వెంటనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఆదోని మార్కెట్ యార్డు డ్రైనేజీల నిర్మాణంలో ఆదోని మార్కెట్ యార్డు అధికారులతో సమీక్ష నిర్వహించి, నిధుల మంజూరుకు డిఇ లెటర్ పంపాలని కలెక్టర్ ఆదోని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పుచ్చకాయలమాడ గ్రామంలో పర్యటించిన సమయంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ నుండి గ్రావిటీ రూపంలో నీటిని అందించేందుకు ఎస్టిమేట్ లు తయారు చేసి పంపామని, వాటి ద్వారా 5 వేల ఎకరాలకు 40 నుండి 50 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే అందుకు సంబంధించిన ప్రతిపాదనల కాపీని పంపించాలని మంత్రి సూచించారు. ఆదోని మాతా శిశు వైద్యశాలను తనిఖీ చేసి ఎంక్వైరీ రిపోర్ట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదోని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జిల్లా ఎస్‌పి బిందు మాధవ్, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు నష్టం వాటిల్లకుండా చర్యలు

- రైతుకు, వినియోగదారునికి మేలు చేకూరుస్తాం
- కోడుమూరులో ఉల్లి మార్కెట్‌ను అభివృద్ధికి చేసేలా చర్యలు
- జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఉల్లి రైతుకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం కర్నూలు ఉల్లి మార్కెట్ యార్డును మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కర్నూలు ఉల్లి మార్కెట్ యార్డును సందర్శించినట్లు తెలిపారు. కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాలతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి కూడా కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లి వస్తోందని చెప్పారు. రైతుకు, వినియోగదారునికి మేలు చేకూరే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పది రోజులుగా కర్నూలు ఉల్లి మార్కెట్ గురించి వార్త పత్రికల్లో, టివిల్లో వస్తున్న కథనాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కథనాల గురించి మంత్రి, కలెక్టర్, సెక్రటరీలతో చర్చిస్తున్నామన్నారు. గతనెలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-నామ్ పోర్టల్‌లో సాంకేతికంగా సమస్యలు రావడంతో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ఆన్‌లైన్ పని చేయకపోతే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో కర్నూలు మార్కెట్ యార్డుకు 2.25 లక్షల క్వింటాళ్ల ఉల్లి వస్తే, గతేడాది అక్టోబర్‌లో కేవలం 52 వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. గతేడాది కంటే నాలుగు రెట్లు అధికంగా దిగుబడి వచ్చినా రైతుకు నష్టం జరగకుండా కొనుగోలు చేసినట్లు చెప్పారు. గతనెలలో కొనుగోలు చేసిన ధర కూడా సగటుగా రూ.3,180గా ఉందని తెలిపారు. మార్కెట్ యార్డులో ఉన్న రైతులతో మాట్లాడినప్పుడు వర్షాలు కురవడంతో ఎకరాకు 70 నుంచి 80 క్వింటాళ్ల వరకు దిగుబడి పెరిగిందని చెప్పారని అన్నారు. దిగుబడి ఎంత వచ్చినా రైతులకు నష్టం వాటిల్లకుండా కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో రెండు షెల్టర్లను ఏర్పాటు చేసి, హమాలీలకు తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చుట్టుపక్కల ఉన్న 8 జిల్లాలకు కర్నూలు మార్కెట్ యార్డు మధ్యలో ఉన్నందున రైతులు ఇబ్బంది పడకుండా, దళారులు సిండికేట్ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కోడుమూరులో కూడా ఉల్లి మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు మంత్రి ఉల్లి రైతులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లాలప్ప, రామాంజనేయులు అనే రైతులతో మాట్లాడుతూ... ఎకరాకు ఎంత ఖర్చు అవుతుంది, ఎంత దిగుబడి వస్తుంది, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలకు ఎంత ఖర్చు అవుతుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి.రంజిత్ బాష, జెసి డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, మార్కెట్ కార్యదర్శి ఆర్.జయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రామానాయుడు

యురేనియం తవ్వకాలు నిలిపేయాలి

• రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
• కోడుమూరులో ఎపి రైతు సంఘం రాస్తారోకో

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కప్పట్రాళ్ల గ్రామం దాని పరిసర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన యురేనియం తవ్వకాలను వెంటనే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేస్తూ కోడుమూరు పాత బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేటు వారి కోసం పచ్చని పల్లెలను, పచ్చని పంట పొలాలను నాశనం చేయడానికి కూడా వెనుకాడదని, అందుకు కప్పట్రాల యురేనియం తవ్వకాలే నిదర్శనమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో యురేనియం వ్యాపారం చేయడానికి ప్రయివేట్ వారికి అప్పజెప్పడం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ ప్రాంత ప్రజలు హంద్రీనీవా ద్వారా వచ్చిన నీటితో పంటలు పండించి తమ పిల్లలను చదివించుకుంటూ రెండు ముక్కలు అన్నం తింటున్నారన్నారు. అలాంటిది యురేనియం పేరుతో తవ్వకాలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం తెలపడం చాలా ఆందోళన గురిచేసిందన్నారు. రైతులను ప్రజలను భయాందోళనకు గురిచేస్తుందన్నారు. రైతు సంఘం యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలందరిని పోగేసి యురేనియం తవ్వకాలను ఆపేంతవరకు పూర్తిగా విరమించుకునే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ప్రజల మనోభావాలను దెబ్బతీయకుండా ఆ ప్రాంత ప్రజలను ఆర్థికంగా ఆదుకొని ప్రజలకు మేలు చేయాలని వారి డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు ఆంజనేయులు, మల్లయ్య, హనుమంతు, శ్రీరాములు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు కోరారు. విఆర్‌ఎలతో కలిసి కలెక్టర్ పి రంజిత్ బాషకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు వేస్తున్నారన్నారు. నైట్ డ్యూటీల నుండి విఆర్‌ఎలను మినహాయించాలని కోరారు. నైట్ డ్యూటీలు ఎమ్మార్వో ఆఫీసులో దగ్గరే కాకుండా ఇసుకరీచ్‌ల వద్ద డ్యూటీలు కూడా వేస్తున్నారన్నారు. అటువంటి డ్యూటీల నుండి మినహాయించాలని కోరారు. ఖాళీగా ఉన్న విఆర్‌ఒ పోస్టులను అర్హులైన విఆర్‌ఎల ద్వారా భర్తీ చేయాలన్నారు. అటెండర్ పోస్టులు వాచ్మెన్ పోస్టులు రికార్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నిటిని అర్హులైన విఆర్‌ఎల ద్వారా భర్తీ చేయాలన్నారు. పే స్కేల్ జీతాలు అమలు చేయాలని నామినేలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు విఆర్‌ఎల ధర్నాకు విచ్చేసి అధికారంలోకి వస్తే జీతం రూ.15000 చేస్తానని హామీ ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరే విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని కోరారు. విఆర్‌ఎల సంఘం నాయకులు వీరేష్, చాంద్ బాష, లింగన్న, టి.మల్లన్న, బి.ఉసేని, శివ, లక్ష్మన్న పాల్గొన్నారు.

శాఖల్లో మార్పు రావడం లేదు

- వెల్దుర్తి ఇఒఆర్‌డి, కర్నూలు టిపిఒకి చార్జీ మెమో
- కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నిసార్లు చెప్పినా అనేక శాఖల్లో మార్పు రావడంలేదని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా బాధితుల నుండి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను జాప్యం లేకుండా సంతృప్తికరమైన పరిష్కార మివ్వాలన్నారు. కొంతమంది అధికారులు వచ్చిన అర్జీకి సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని శాఖల అధికారులు సంబంధం లేని అంశాలను అప్లోడ్ చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అప్లోడ్ చేసిన వెల్దుర్తి ఇఒఆర్‌డి పై చార్జెస్ ఫ్రేమ్ చేయాలని కలెక్టర్ జిల్లా పరిషత్ సిఇఒ , డిపిఒను ఆదేశించారు. అదే విధంగా కర్నూలు మున్సిపాలిటీకి సంబంధించిన టౌన్ ప్లానింగ్ విభాగపు అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. రీఓపెన్ కేసులకు సంబంధించి మొత్తం 21 కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర బాబు

టిడ్కో గృహాల్లో వసతుల కల్పనకు చర్యలు

- కమిషనర్ రవీంద్ర బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జగన్నాథ గట్టు వద్దనున్న టిడ్కో గృహాల్లో వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. సోమవారం అధికారులతో కలిసి కమిషనర్ టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడ్కో గృహాల్లో 255 బ్లాకుల్లో 10 వేల గృహాలు ఉన్నాయన్నారు. అందులో నివాసముంటున్న లబ్ధిదారులు, ఖాళీగా ఉన్న గృహాలకు సంబంధించిన వివరాలు, విద్యుత్, తాగునీటి కనెక్షన్ వంటి వివరాలను తెలుసుకునేందుకు అధికారులు, సచివాలయ సిబ్బందితో సర్వే చేపట్టామన్నారు. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని, గృహాల్లో మరమ్మతు పనులను చేపడతామని తెలిపారు. టిడ్కో డిఈ గుప్తా, నగరపాలక టిడ్కో స్పెషలిస్ట్ అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తే ముఖ్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వస్తున్న ఫిర్యాదులను, అర్జీదారుల సంతృప్తే ముఖ్యంగా సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. ఒక్కో అర్జీదారుడి నుండి ఫిర్యాదును స్వీకరిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఎస్ఇ, జి.రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఒ జునైద్, ఎంఇ శేషసాయి, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, డిపిఒ ఉమోష్ తదితరులు పాల్గొన్నారు

వలసలతో ఊళ్లు ఖాళీ...

- పనుల కోసం పొరుగు రాష్ట్రాలకు పరుగు- చదువుకు చిన్నారులు దూరం

ప్రజాశక్తి - తుగ్గలి : వలసలతో ఊళ్లు ఖాళీ అవుతున్నాయి. పనుల కోసం పొరుగు రాష్ట్రాలకు కూలీలు పరుగులు తీస్తున్నారు. దీంతో చిన్నారులు చదువుకు దూరం అవుతున్నారు. 'వలసలకు అడ్డుకట్ట వేస్తాం. ప్రజల జీవన ప్రయాణాలు పెంచడానికి చర్యలు తీసుకుంటాం' అనిపాలకులు పదేపదే చెబుతుంటారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నట్లు గొప్పలు పోతారు. చేయడానికి పని లేక సాగు సదుపాయాలు లేక రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కూలీలు ఊరు కానీ ఊరుకు బతుకుదెరువు కోసం వలస బాట పడుతున్నారు.

తుగ్గలి మండలంలోని పలు గ్రామాల్లో వలసలతో ఊళ్లన్నీ ఖాళీ అవుతున్నాయి. ఏ గడపకు వెళ్లినా తాళాలే దర్శనమిస్తున్నాయి. ఇంటి వద్ద వృద్ధులను కాపలా పెట్టి పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళు తున్నారు. అతివృష్టి, అనావృష్టితో వరుస కరువులు రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా చేస్తున్నాయి. పంటకు పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. ఇక చేసేది లేక ప్రజలు వలసబాట పడుతున్నారు. మండలంలోని కోతికొండ, మామూలుకుంట, ఎద్దులదొడ్డి, పెండేకల్ గ్రామాల నుంచి రోజూ వందలాదిమంది మూటముళ్ల సర్దుకుని వలస పోతున్నారు. గ్రామాలన్నీ ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఈఏడాది పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటల కోసం తెచ్చిన అప్పులు తీర్చడానికి పిల్లాపాపలతో సహా సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. చదువుకునే పిల్లలను సైతం వెంట తీసుకెళ్తున్నారు. అక్టోబర్ ప్రారంభం నుంచి తుగ్గలి మండలంలోని గ్రామాల్లో వలసలు ప్రారంభమవుతాయి. ఎక్కువగా బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్తారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2024లో డిఇఒ సామ్యూల్‌పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అలవాటు కావాలనే ఉద్దేశంతోనే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2024 వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు డిఇఒ సామ్యూల్ పాల్ తెలిపారు. సోమవారం విట్టల్ నగర్‌లో గుడ్ షెపర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2024 ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఉప విద్య అధికారి హనుమత్ రావు, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, సునీల్ కుమార్, ఎన్‌జిసి కోఆర్డినేటర్ రాజ్ శేఖర్, కౌశల్ , జాయింట్ కోఆర్డినేటర్ రంగస్వామి, ఎపిడిఎస్ మరియానందం, పి ఆర్ డిఒ గోపాల్, గుడ్ షెపర్డ్ స్కూల్ కరస్పాండెంట్ డి.మిన్నల్లా ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి భావి శాస్త్రవేత్తగా ఎదిగేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ అనేది ఒక చక్కని అవకాశంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీంట్లో భాగంగానే ఉపాధ్యాయుల సహకారంతో ప్రతి విద్యార్థి కూడా వినూత్నంగా సైన్స్, సమాజంలో సమస్యలను ఎదుర్కోవడానికి పర్యావరణ ప్రాజెక్టులు రూపొందించి వారి భవిష్యత్తులో భావి శాస్త్రవేత్తగా మార్చాలన్నారు. అందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ముఖ్య ఉద్దేశంగా తెలిపారు. ఇందులో ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డిఇఒ తెలిపారు. విద్యార్థులను సాంకేతికత వైపు ముగ్గుచూపాలంటే టీచర్స్ టెక్నాలజీతో పని చేయాలన్నారు. గుడ్‌షెపర్డ్ కరస్పాండెంట్ డి.మిన్నల్లా మాట్లాడుతూ అందుకే తమ స్కూల్ గ్రౌండ్‌లో స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఏర్పాటు చేశామని తెలిపారు. 320 మంది పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- సి బెళగల్

యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సంఘాలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎపి తిమ్మన్న కోరారు. సోమవారం సి.బెళగల్‌లో ఫ్లెక్సిబోర్డు ద్వారా ఆహ్వానం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు హనుమంతు, బి కిషోర్, మండల అధ్యక్షులు మనోజ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి హనుమన్న లు పాల్గొన్నారు. జిల్లా మహా సభలను ఈనెల 9,10 తేదీలలో గూడూరు పట్టణంలో నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయని తెలిపారు.

రైల్వేలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కోడుమూరు

రైల్వే శాఖలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గూడూరు మండలం చనగొండ్ల గ్రామంలో డివైఎఫ్ఐ 45వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణలు చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర , గూడూర్ డివైఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి జై.మోహన్, మధు జెండా ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ రైల్వే ప్రమాదాలు గతంలో ఎన్నడూ లేనంత పెరిగిపోయాయని, ఆ ప్రమాదంలో అమాయక ప్రజలు, ఉద్యోగస్తులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రైల్వే ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న14 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఇప్పటికీ కొన్ని ఖాళీ పోస్టులకు ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన వారిని తీసుకోవడం, నిరుద్యోగులను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ఈనెల 5న రైల్వే స్టేషన్ ముందు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమంలో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అంజి గోపి మహేష్ ప్రేమ్ వెంకటేష్, బాషా, రవి, వీరబాబు, చనిగొండ్ల, డివైఎఫ్ఐ, రమేష్ రంగడు సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి- దేవనకొండ

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో తీవ్ర నష్టం జరిగిందని, దేవనకొండ మండలాన్ని కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వం సాంకేతిక లెక్కల ఆధారంగా చేసుకుని మండలంలో కరువు లేదని ప్రకటిస్తోందని తెలిపారు. మండలంలోని కప్పట్రాళ్ల, తెర్నేకల్లు, కోటకొండ, గుండ్లకొండ, బంటుపల్లి, బేతపల్లి, గుడిమరాళ్ల, జిల్లెడుబుడుకుల, కరివేముల, పాలకుర్తి, నెల్లిబండ తదితర గ్రామాల్లో వేరుశనగ, ఆముదం, పత్తి పంటకు బాగా నష్టం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం వాస్తవాలను గ్రహించి వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలంలో 10 వేల ఎకరాలకు పైగా వేరుశనగ, 14 వేల ఎకరాకు పైగా పత్తి, 3 వేల ఎకరాల్లో ఆముదం సాగు చేశారని తెలిపారు. ఈ పంటల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు అశోక్, బజారి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, వీరేంద్ర, సుధాకర్, రవీంద్ర, ఏలియా, లోకయ్య పాల్గొన్నారు.

వెంకటేష్ స్వామి పుట్టినరోజు వేడుకలు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక పంకజా ప్యారడైజ్‌లో టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి సోదరులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేష్ స్వామి కేక్ కట్ చేయగా శ్రీనివాసులు రెడ్డి ఆయనకు కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలతో సన్మానించారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ వనికె గురురాజ, నియోజకవర్గ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, హండే హనుమంతు, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, వనికె నాగరాజు, వర్ధిరాజులు, యోబు పాల్గొన్నారు.

'కోర్టు భవన సముదాయం పూర్తి చేయించాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో కోర్టు భవనాన్ని త్వరగా పూర్తి చేయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ బాధ్యులు విజయభాస్కర్ రెడ్డి కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో మూడేళ్ల క్రితం కోర్టు భవన సముదాయం నిర్మాణం మొదలైందన్నారు. ఇంతవరకు పనులు పూర్తికాకపోవడంతో జడ్జిలు, న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న కోర్టు భవనాలు చిన్నపాటి వర్షం కురిసినా కారుతున్నాయని చెప్పారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. భవనాలను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. సబ్ కలెక్టర్... రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. నిర్ణీత సమయంలోపు నిర్మాణం పూర్తి చేయించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. న్యాయవాదులు నాగరాజు, ఇస్మాయిల్, అనుమేష్, కృష్ణ ఉన్నారు.

పశుగణనను సద్వినియోగం చేసుకోండి

- పశు వైద్యాధికారి మహేష్

ప్రజాశక్తి - చిప్పగిరి

పశుగణన కార్యక్రమాన్ని పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి మహేష్ సూచించారు. సోమవారం నేమకల్లు గ్రామంలో పశువైద్యాధికారి మహేష్ ఆధ్వర్యంలో పశుగణనలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పశువులను లెక్కించి వాటికి ట్యాగులు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువులు ఉన్న వారందరూ పశుగణనను సద్వినియోగం చేసుకొని, పశువులకు సోకే వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. తొలివిడతగా నేమకల్లు, ఏరూరు, బంటనహళ్, గుమ్మనూరు గ్రామాల్లో చేపట్టినట్లు చెప్పారు.

రేషన్ షాపులపై రగడ

- ఇన్‌ఛార్జి తీరుపై నాయకుల్లో అసంతృప్తి
- ప్రత్యర్థులకు ఇస్తున్న వైనం

ప్రజాశక్తి - ఆలూరు

నియోజకవర్గంలో రేషన్ షాపులపై రగడ సాగుతోంది. టిడిపి జెండా మోసిన వారికి కాకుండా ప్రత్యర్థులకు డీలర్‌షిప్‌లు ఇస్తున్నారని కేడర్ అసహనం వ్యక్తం చేస్తోంది. టిడిపి ఇన్‌ఛార్జి తీరుపై మండిపడుతున్నారు.

టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ ఒంటెద్దు పోకడలతో వెళ్తున్నారని టిడిపి కేడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. రేషన్ డీలర్ల నియామకాల్లో టిడిపి జెండా మోసిన వారికి కాకుండా ప్రత్యర్థులకు ఇస్తున్నారని బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆలూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన టిడిపి నాయకుని బంధువునికి రెగ్యులర్ డీలర్ షిప్ ఉండేది. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రావడంతో రెగ్యులర్‌గా ఉన్న డీలర్ షిప్‌ను ప్రత్యర్థికి ఇవ్వబోతున్నట్లు తెలుసుకొని టిడిపి గ్రామ నాయకులు తమకే ఇవ్వాలని పలుసార్లు అడిగినా స్పందించకపోవడంతో నిరుత్సాహం చెందారు. ఆదోనిలోని ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ పరిశ్రమ కార్యాలయంలో తనయుడు గిరి మల్లేష్ గౌడ్‌ను అడిగేందుకు వెళ్లారు. ఆయన వారిపై దురుసుగా మాట్లాడడంతో ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగడం ఆలూరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మనేకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో అంగస్కల్ డీలర్ షిప్‌ను అదే పంచాయతీకి చెందిన బీసీ సెల్ రాష్ట్ర

నాయకుని గ్రూపునకు ఇవ్వకుండా ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి మద్దతు ఇచ్చిన వారికి ఇస్తారనే విషయంపై రచ్చ రచ్చగా మారింది. ఈ విషయాన్ని స్థానిక బీసీ రాష్ట్ర నాయకులు జిల్లా, రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. డీలర్ షిప్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర నియామకాల్లో అన్యాయం చేస్తున్నారని పార్టీ కేడర్ మండిపడుతోంది. అలాగే అరికెర గ్రామంలో కూడా స్థానిక నాయకుల మధ్య డీలర్ షిప్‌పై వాగ్వాదం జరుగుతోంది. డీలర్ షిప్, ఫీల్డ్ అసిస్టెంట్లు పోస్టులు, రెవెన్యూ, సచివాలయం అధికారుల బదిలీలను అంగట్లో సరుకుగా అమ్మకానికి పెట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే ఇస్తున్నట్లు సమాచారం.

మధ్యవర్తితో దందా...

ఆలూరు పట్టణానికి చెందిన ఒక విలేకరి మధ్యవర్తిగా ఉంటూ దందా సాగిస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగ బదిలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్ షిప్‌ల నియామకాలు ఆయన ప్రమేయంతో జరుగుతున్నట్లు సమాచారం. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అరికెర గ్రామంలో ఇటీవల పెద్ద ఎత్తున పేకాట జరుగుతుండగా డీఎస్పీ వెంకటరామయ్య ప్రత్యక్షంగా వెళ్లి పట్టుకున్నారు. గ్రామంలో ఇన్‌ఛార్జి అనుచరుడు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. పేకాటలో రూ.1.60 లక్షలతో పాటు నాలుగు కార్లు, నాలుగు బైక్‌లు పట్టుబడ్డాయంటే ఏ స్థాయిలో పేకాట కార్యకలాపాలు జరుగుతున్నాయో అర్థమౌతుంది. ఈ పేకాటను విలేకరి ప్రోద్బలంతో నిర్వహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

టిడిపి జెండా మోసిన వారికి అన్యాయం

- మౌలాలి, టిడిపి యూత్ నాయకులు, అంగస్కల్ గ్రామం

గ్రామంలో ఏళ్ల తరబడి టిడిపి జెండా మోసిన వారికి డీలర్ షిప్ ఇవ్వకుండా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్యాయం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో టిడిపి కార్యకర్తల ఇంటిపైకి వచ్చి దాడి చేసిన వారికి డీలర్ షిప్ ఇస్తామని చెప్పడం ఇన్‌ఛార్జికి తగదు.

క్రీడాకారిణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

జాతీయ స్థాయి క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - మంత్రాలయం

క్రీడల్లో జాతీయ స్థాయికి చేరుకున్న విద్యార్థిని షేక్ ముస్కాన్‌ను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రామకృష్ణారెడ్డి అభినందించారు. సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోనూ, ఇన్‌ఛార్జి స్వగ్రామమైన మాధవరంలో వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజులు, విద్యార్థినులు వారిని కలిశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్ ముస్కాన్‌ను, ఇతర విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడల్లో ప్రోత్సాహానికి తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. నవంబర్‌లో జమ్మూ కాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో జరిగే 68వ ఎస్‌జిఎఫ్ అండర్-14 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పిఇటిలు తెలిపారు.

బడుల వద్ద మద్యం దుకాణం వద్దు

- జైభీమ్ యూత్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పాఠశాలల వద్ద మద్యం దుకాణాలు వద్దని జై భీమ్ యూత్ ప్రెసిడెంట్ సురేష్, వైస్ ప్రెసిడెంట్ బండారి మారెన్న కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేపట్టారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు దగ్గర ఉండడంతో విద్యార్థినులు రాకపోకల సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు నిబంధనలు తప్పకుండా అమలు చేయాలని కోరారు. జై భీమ్ యూత్ ఆదోని సెక్రటరీ నాగరాజు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీని నెరవేర్చాలి

- రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - నందవరం

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన 'అన్నదాత సుఖీభవ' హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని రైతుసంఘం నాయకులు పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ పథకం' కింద రూ.20 వేలను రైతుల ఖాతాకు జమ చేయాలని కోరారు. రాష్ట్రంలో 60 శాతం మంది రైతులు ఉన్నారని, వారి పెట్టుబడులకు సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఖరీఫ్ పంట సీజన్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభమైందని, రైతులకు ఆర్థిక సహాయం అందించకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రైతుసంఘం నాయకులు శాంతప్ప, విజయ్ కుమార్, ఆంజనేయులు, ముని, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఉరుకుందలో కార్తీక మాసోత్సవాలు

- భారీగా తరలి వచ్చిన భక్తులు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో శ్రావణ మాసోత్సవాల తర్వాత అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాలు కార్తీక మాస పూజలు. కార్తీక మాసం సోమవారం నుంచి నెలరోజుల పాటు భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పుణ్యక్షేత్రానికి రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తుంగభద్ర దిగువ కాలువలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా పర్యవేక్షకులు మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, కుమార్, వీరేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ పర్యవేక్షించారు. స్వామి వారి దర్శనానికి, అన్నదానం సత్రం వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆదోని, సిరుగుప్ప, ఎమ్మిగనూరు, రాయచూర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపించారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రదీప్‌రెడ్డి

స్వామివారి సన్నిధిలో ప్రదీప్ రెడ్డి

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి వారిని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి దర్శించుకుని, పూజలు చేశారు. వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, వైసిపి నాయకులు రామన్న, పొదలకుంట ఎంపిటిసి మూకన్న ఉన్నారు. ప్రదీప్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు.

అభివృద్ధికి ఆమడదూరం.. నంచర్ల...

- అధికారులు వస్తే కూర్చోవడానికి కూడా కార్యాలయం కరువు
- బస్సు సౌకర్యం లేక అవస్థలు
- తాగునీటి కోసం ఎప్పుడూ కష్టాలే

ప్రజాశక్తి - చిప్పగిరి

పల్లెలు ప్రగతికి చిహ్నాలు... వాస్తవానికి అభివృద్ధి లేక, కనీసం వసతులు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటివరకు బస్సు సౌకర్యం కూడా లేని గ్రామాలు ఉన్నాయి. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం ఎప్పుడూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చిప్పగిరి మండలంలో మారుమూలలో నంచర్ల గ్రామం ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 3 వేల పైచిలుకు జనాభా ఉంది. గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. చదువుకునే చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్ద వారి వరకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయమే చదువుకోవడానికి చిన్నపిల్లలు గుంతకల్లుకు వెళ్లాలంటే ప్రయివేట్ ఆటోలు మాట్లాడుకుని వెళ్లే పరిస్థితి ఉందని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. గ్రామంలో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం చేపడితే టెంట్లు వేసుకుని నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఏ అధికారి, ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదు. సొంతంగా పంచాయతీ కార్యాలయం నిర్మించకపోవడం సిగ్గుచేటని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామంలో సిసి రోడ్లు లేకపోవడంతో చాలామంది వీధుల్లో అడ్డంగా బాత్‌రూమ్‌లు, కట్టలు నిర్మించుకున్నారు. పంచాయతీ అధికారులు అడ్డు చెప్పకపోవడంతో వీధులు చాలా ఇరుకుగా తయారయ్యాయి. శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించలేక కొత్తగా పైపులైను వేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. రైల్వే గేటు పక్కన నివాసం ఉన్న కుటుంబాలకు మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదని, తమకు అందుబాటులో ట్యాంకు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంచర్ల గ్రామానికి మండల కేంద్రమైన చిప్పగిరికి ప్రయాణం చేయాలంటే కూడా సరైన రహదారి లేదు. గుంతకల్లు పట్టణానికి వచ్చి ఇటు చిప్పగిరికి చేరుకునే పరిస్థితి ఉంది. ఇటు చిప్పగిరి నుంచి దౌల్తాపురం మీదుగా నంచర్ల గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో వర్షాలు వచ్చినప్పుడల్లా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

టెంట్‌లోనే కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

బస్సు సౌకర్యం కల్పించండి : కిష్టప్ప, గ్రామస్తుడు

గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో పాఠశాలలకు వెళ్లే పిల్లలు, కూలి పనులకు పట్టణానికి వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారం చూపాలి.

శాశ్వత పరిష్కారం చూపండి : లింగన్న, గ్రామస్తుడు

గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. శాశ్వత పరిష్కారం చూపడం లేదు. సమస్య తీవ్రమైనప్పుడు మాత్రం అప్పటికి ఏదో ఒక రకంగా సమస్యను తీరుస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపడానికి నూతన పైపులైన్ ఏర్పాటు చేసే పనులు చేపట్టలేకపోతున్నారు. ఇప్పటికైనా నూతన పైపులైన్ ఏర్పాటు చేసి పరిష్కారం చూపుతారని ఆశిస్తున్నాం.

'ఎపి ఎస్‌పిడిసిఎల్' బోర్డు కౌన్సిలర్‌గా జనార్ధన్

ప్రజాశక్తి - ఆదోని

ఎపిఎస్ పిడిసిఎల్ బోర్డ్ లీగల్ కౌన్సిలర్‌గా అడ్వకేట్ జనార్ధన్ నియమి తులయ్యారు. సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదోని డివిజన్ ఎపిఎస్‌పిడిసిఎల్ బోర్డు లీగల్ కౌన్సిలర్‌గా ఆదోని అడ్వకేట్ బార్ అసోసియేషన్ నుంచి తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆదోని డివిజన్‌లో విద్యుత్ సంస్థలో లీగల్‌కు సంబంధించిన కేసులను ప్రభుత్వం తరఫున వాదించి సమస్యలు పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు జనార్ధన్ ఎన్నికైన సందర్భంగా ఆదోని అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ తరఫున సీనియర్, జూని యర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో ఉన్న కళాశాల ఎస్సీ బాలుర విద్యార్థుల వసతి గృహాన్ని వేరే భవనంలో మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్కడ నివాసం ఉన్న విద్యార్థులకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రు లు భయాందోళనకు గురవుతు న్నారని తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, పైకప్పు పెచ్చులూడి పడుతోం దని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఫలితంగా గతంలో భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. మరమ్మతులు కాకుం డా భవన నిర్మాణం పటిష్టంగా చేపట్టి ప్రమాదాలు జరగకుం డా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాల ని, లేకపోతే విద్యార్థులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శశిధర్, రాజు, గణేష్, యశ్వంత్, రవితేజ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమాభివృద్ధికి కృషి

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వికలాంగుల కృతజ్ఞత ర్యాలీకి సహకరిస్తామని, వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి హామీఇచ్చారు. సోమవారం తిక్కారెడ్డిని ఆయన నివాసంలో మల్లెల గ్రూప్స్ అధినేత, సామాజిక వేత్త, వికలాంగుల సంక్షేమ సంఘాల గౌరవాధ్యక్షులు, డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు అధ్యక్షతన వికలాంగుల జిల్లా సాధికారత ఫోరం (డిఈఎఫ్) అధ్యక్షులు బీసీ.నాగరాజు కలిశారు. ఈ సందర్భంగా ఆల్ఫ్రెడ్ రాజు, నాగరాజు మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గం నుంచి ఆలూరు టూ అమరావతి వరకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి భాగస్వాములైన టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరిని, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసేందుకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. తిక్కారెడ్డి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎపి ఎన్‌జిఒస్ కార్యాలయంలో జరిగిన వికలాంగుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు బీసీ.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.శివశంకర్, కోశాధికారి ఎ.ఆదిశేషయ్య మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వికలాంగుల సామాజిక హక్కులు, చట్టాలు, రాయితీ, రిజర్వేషన్లు హరించుకుపోయాయని విమర్శించారు. కర్నూలు జిల్లా వేదికగా సామాజికవేత్త మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు సారథ్యంలో ఉద్యమాలు కొనసాగాయని చెప్పారు. ఫలితంగా వికలాంగులు రూ.6 వేల పింఛను పొందుతున్నారని తెలిపారు. కృతజ్ఞత ర్యాలీ తేదీని త్వరలోనే ఖరారు చేస్తామని చెప్పారు. తాలూకా నాయకులు యు.వీరేష్, ఎస్.వెంకటేష్, ఈ.రాజశేఖర గౌడ్, వి.నరసింహులు, దేవనకొండ ధోనీ బజారి, గోనెగండ్ల మండల నాయకులు రంగన్న, బెళగల్ మండల నాయకులు రామదాస్, మల్లికార్జున, రాజు, పెద్దకడబూరు కన్వీనర్ రామన్న, రామాంజనేయులు, మంత్రాలయం భీమేష్ పాల్గొన్నారు.


తిక్కా రెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కూలీల శాతం పెరగాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పనులు చేసుకునే కూలీలు శాతం పెంచాలని ఎంపిడిఒ అల్లా బకాష్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కార్యాలయంలో ఎపిఒ జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీల శాతం పెరుగుదలకు ఉపాధి హామీ సిబ్బందితో అవగాహన కార్యక్రమం చేపడితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

నేమకల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ జుబేర్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న వారికి కూడా ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు చేసుకోవడానికి వెసలుబాటు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. ఏ ఒక్కరూ వలసలు వెళ్లకుండా పనులు కల్పించే బాధ్యత తమపై ఉందన్నారు. అనంతరం గ్రామంలోకి వచ్చి ఉపాధి కూలీలు పనులు చేసేలా అవగాహన కల్పించి, పనులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ రాంప్రసాద్ ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి, పాండు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరుపాక్షిని దూషించడం తగదు

- ఎంపిప భర్త లుముంబా

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో 2017లోనే మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో యురేనియం తవ్వకాలపై తీర్మానాలు చేసినట్లు ఆ గ్రామస్తులు చెప్పడంతోనే ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిపై ఆరోపణలు చేశారని, ఎమ్మెల్యేను దూషించడం తగదని ఎంపిపి భర్త లుముంబా, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి నాయకులు హనుమంతు రెడ్డి తెలిపారు. సోమవారం దేవనకొండలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యురేనియం తవ్వకాలపై గత టిడిపి ప్రభుత్వం అనుమతులు ఇచ్చి 2023 వైసిపి ప్రభుత్వంపై బురద చల్లడం తగదన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షిని దూషించే హోదా కప్పట్రాళ్ల కుటుంబానికి లేదని తెలిపారు. వైసిపి నాయకులు గఫూర్, నరసింహయ్య స్వామి, కొత్తపేట బాబు, చంద్రన్న, జుబేర్, రంగస్వామి, మీనుగ కృష్ణ, కేశన్న, మాల అంజి, శ్రీరాములు, మద్దిలేటి, లింగన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి భర్త లుముంబా

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్మశాన వాటికలో పనిచేసే కాటి కాపరులను ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కెవిపిఎస్ మండల అధ్యక్షులు మారెప్ప, ఉపాధ్యక్షులు సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో సచివాలయ సిబ్బంది పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాటికాపరులను ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, వారికి రక్షణ, భద్రత, ఆరోగ్య బీమాను కల్పించాలని కోరారు. జిఒ ప్రకారం ప్రతి గ్రామంలో శ్మశానాల కోసం ప్రభుత్వం రెండెకరాల భూమిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ మాధవరం గ్రామ అధ్యక్షులు తలమారి నడిపి తిక్కన్న, కార్యదర్శి మేకల చిన్న ఆంజనేయ, సభ్యులు ఏలియా, దేవిపుత్ర, అశోక్, అంపయ్య, జయరాజు, ఇస్రాయిల్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భక్తునిపై అర్చకుని దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - కౌతాళం

భక్తునిపై దురుసుగా ప్రవర్తిస్తున్న అర్చకుడు

దేవాలయాలు అభివృద్ధి చెందాలంటే భక్తులు ముఖ్యం. దేవాలయానికి వచ్చే భక్తులను దేవాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతించాల్సి ఉంది. భక్తుల పట్ల అర్చకుడు దురుసుగా ప్రవర్తించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రానికి దర్శనంతో పాటు తన వాహనాన్ని వాహన పూజ చేయడానికి వచ్చిన భక్తునికి ఇలాంటి సంఘటన ఎదురైంది. పెద్ద గోనెహాళ్ గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని తన వాహనానికి వాహన పూజ చేయించడానికి అర్చకుని వద్దకు వచ్చారు. వాహన పూజ చేసిన అర్చకునికి రూ.100 సమర్పించినా ఒప్పుకోకుండా.. 'వాహనాలు కొనడానికి డబ్బులు వస్తాయి. అర్చకులకు రూ.216 చెల్లించడానికి డబ్బులు లేవా' అని చెప్పలేని పదజాలంతో దూషించినట్లు సూపరింటెండెంట్ మల్లికార్జున దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన దేవాలయ అధికారులు మల్లికార్జున స్వామి, కుమార్, కిరణ్, వీరేష్ అర్చకుడు మల్లయ్య స్వామి వద్దకు వెళ్లి ప్రశ్నించగా వాహన పూజ టికెట్టు తీసుకురావాలని చెప్పానని, దురుసుగా ప్రవర్తించలేదని, తనపై భక్తుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధికారులకు వివరించారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండ : టిడిపి

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండలం అరికెర గ్రామంలోని పొలంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన టిడిపి గ్రామ అధ్యక్షులు కురువ దూలప్ప కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం దూలప్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అరికెర సర్పంచి కుప్పగల్లు నాగరాజు, టిడిపి మండల నాయకులు బొగ్గుల రాముడు, బలరాం చౌదరి, భీమేష్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న నారాయణ రెడ్డి

మహారాజశ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No.740/2020

బోరవెల్లి మల్లికార్జున రెడ్డి. ...వాది

-VS-

యం.రవికృష్ణ తండ్రి యం.లింగేశ్వరయ్య
స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరక్టర్),
ఇంటి నెం.81-5-511-31, సాయినగర్, కల్లూరు
కర్నూలు జిల్లా. (వర్కింగ్ అడ్రసు)
యం.రవికృష్ణ, ఎస్.ఎ (పి.డి) జిల్లా పరిషత్ హైస్కూల్,
పర్ల గ్రామము, (పోస్టు), కల్లూరు (మం),
కర్నూలు జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥ 3,10,875.00, ఇందుపైన ముందు వడ్డి, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 18-11-2024 తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఎ. ప్రభాకర్ రెడ్డి,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజా సేవలో శిల్పా కుటుంబం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శిల్పా కుటుంబం గత రెండు దశాబ్దాలకు పైగా ప్రజా సేవా కార్యక్రమాలను శిల్పా సేవా సమితి ద్వారా కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శిల్పా సేవా సమితి కార్యాలయంలో రాష్ట్ర సహకార యూనిట్ లిమిటెడ్ అనంతపురం వారి ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల పాలక వర్గ సభ్యులకు సహకార సంఘం నిర్వహణ, విధులు, భాధ్యతలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి హాజరై అర్హులైన 189 మంది మహిళలకు 30 లక్షల 20వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో రాయల సీమ సహకార శిక్షణా కేంద్రం కో ఆపరేటివ్ విద్యా కమిషనర్ నరసింహా రెడ్డి, రిసోర్స్ పర్సన్ భాస్కర్ రెడ్డి స్వయం సహాయక మహిళలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, సేవాసమితి మేనేజర్ లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆర్ఆర్ అకాడమీ క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆళ్లగడ్డకు చెందిన ఆర్ఆర్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో ఇటీవల జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ క్రికెట్ సెలక్షన్లు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో ఆళ్లగడ్డ ఆర్ఆర్ అకాడమీ క్రీడాకారులు రిశ్వ హర్షిని, హేమంత్ నాయక్‌లు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అక్షర, వివేకానంద , కార్తీక్ నాయక్, వెంకటేష్, నాగార్జున, విశ్వనాథ్ తదితరులు ఖో ఖో, ఫుట్బాల్, హ్యాండ్ బాల్ తదితర క్రీడల్లో ఆళ్లగడ్డ ఆర్ఆర్ అకాడమీ నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆర్ఆర్ అకాడమీ సీనియర్ క్రీడాకారుడు రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆర్ఆర్ అకాడమీ నిర్వాహకులు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎస్వీఎన్ హరి ప్రసాద్ రెడ్డి, సుజాత , డాక్టర్ ఏ.వి.రామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాంగోపాల్ రెడ్డి, వేణు, వంశీ, భువన శేఖర్ తదితరులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందించారు. ఆళ్లగడ్డ నుండి బాలికల విభాగంలో క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం ఇదే మొదటిసారి అని, రీశ్వ హర్షినికి, అలాగే మిగిలిన క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ , శిక్షణ ఇచ్చిన కోచ్ సుబ్బరాయుడును అభినందించారు,

క్రీడాకారులను అభినందిస్తున్న రామకృష్ణ

సిసి రోడ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రానివ్వొద్దు

- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో శంకుస్థాపన చేసిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఇసుక కొరత రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గనుల శాఖ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగులో వున్న పింఛన్ మొత్తాలను తిరిగి జమ చేయాలన్నారు. పింఛన్ మొత్తాన్ని తిరిగి చెల్లించని నెరవాడ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశామన్నారు. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలని సంక్షేమ శాఖ డిడిని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంత పరిధిలోని 48 చెంచు గూడెంలలో 14 మండలాల సచివాలయ సిబ్బంది బృందాలను పైలెట్ సర్వే నిమిత్తం పంపామని, సంబంధిత సిబ్బందికి స్థానికంగా సహకరించాలని సూచించారు. సచివాలయ సిబ్బందికి పెండింగ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు అర్జిత సెలవులను సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పని చేయని ఫింగర్ ప్రింట్ డివైజ్‌లను మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ నెల 9వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటనకు వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ కింద గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు మంగళవారం సాయంత్రంలోగా పంపాలన్నారు. అలాగే పల్లె వనాలు, పశు గ్రాసం, సోక్ పిట్ల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సమావేశంలో జెసి సి.విష్ణు చరణ్, డిఆర్ఒ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

ఎస్టిటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా జవహర్ నాయక్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఎస్టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గోర్ల సుధాకర్ అధ్యక్షతన ఆదివారం నంద్యాల పట్టణంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎస్టిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా జవహర్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జవహర్ నాయక్ మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం, సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో నిరంతరం గిరిజనుల, గిరిజన ఉద్యోగుల, విద్యార్థుల సమస్యలపై పోరాడుతానన్నారు. ఆపదలో ఉన్న గిరిజనులను ఆదుకుంటానని ముఖ్యముగా తల్లిదండ్రులు లేని గిరిజన విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని, నిర్మాణాత్మకంగా సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలంగిరి కుమార్, సంయుక్త కార్యదర్శి మాతృనాయక్, రామకృష్ణ, చంద్రమోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జవహర్ నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

6 వ తేదీన స్టీల్ ప్లాంట్ ఎదుట నిరసన

జి రామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి రైతు సంఘం

జస్ట్ కర్నూలు కలెక్టరేట్

జయరాజ్ స్టీల్ ప్లాంట్ పరిశ్రమలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నష్టపరిహారం చెల్లించాలని ఈనెల 6న జరిగే నిరసనలో పాల్గొనాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ నిరుద్యోగులను, రైతులను కోరారు. సోమవారం ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు గ్రామం లో రైతులు, నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, భూ నిర్వాసితుల కమిటీ నాయకుడు జి రాధాకృష్ణ మాట్లాడారు. ఇప్పటికీ అనేకమంది రైతులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. స్టీల్ ప్లాంట్ పరిశ్రమ పనులు పూర్తి కావస్తున్నా రైతులకు మాత్రం న్యాయం జరగలేదన్నారు. గ్రామంలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా న్యాయం జరగలేదన్నారు. అందుకే ఈనెల 6న స్టీల్ ప్లాంట్ ఎదుట జరిగిన నిరసనలో పెద్ద ఎత్తున రైతులు నిరుద్యోగ యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శివకుమార్, బాల మద్దిలేటి, నాగశేషులు, షేక్షావలి, సుధాకర్, నవీన్,మాలిక్,శివకుమార్, రామాంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి రామకృష్ణ సంఘం

ఎన్నిసార్లు మొరపెట్టిన భూమి సర్వే చేయని అధికారులు

సిఐటియు మండల కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి- మద్దికేర

మహిళా రైతు సులోచన పొలాన్ని సర్వే చేయమని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో రెండు ఎకరాలు భూమి సులోచనకు ఉందన్నారు. ఆమె భూమి సర్వే చేయాలని మీసేవ ద్వారా చలానా కట్టి మూడు నెలలు అయిందని పేర్కొన్నారు. చట్ట ప్రకారం చలాన కట్టిన 15 రోజులకే భూమి సర్వే చేయాలన్నారు. ఆమె భూమిని సర్వే చేయాలని తాను మూడుసార్లు వెళ్లి కలిసినా గ్రామ సచివాలయం సర్వేర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారను. ఎప్పుడు వెళ్ళి అడిగినా తేదీలు వాయిదా వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామ సచివాలయ సర్వేర్ పై చర్యలు తీసుకోవాలని త్వరలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

నైపుణ్య గణన యువత భవితకు భరోసా

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటా నైపుణ్య గణన యువత భవితకు భరోసా అని ఎంపిడిఒ ఫజల్ రెహమాన్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'నైపుణ్య గణన యువతకు భరోసా'లో భాగంగా మండల స్థాయి శిక్షణను సోమవారం నిర్వహించారు. ఎంపిడిఒ ఫజల్ రహిమాన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా సర్వే నిర్వహించి మండల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇందులో యువత సామర్థ్యాన్ని బట్టి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శిక్షణలో సూపరింటెండెంట్ మల్లికార్జున, ఎఒ దస్తగిరి బాబు, ఆర్ఎస్ రంగాపురం కార్యదర్శి కృష్ణమూర్తి, రవితేజ పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణకు 9 టన్నుల కూరగాయలు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలో భక్తులకు, యాత్రికులకు అందించే అన్నప్రసాద వితరణకు 9 టన్నుల కూరగాయలను ధాతలు భాస్కర్, మల్లికార్జున, శివపావని, ఏపిఎంసి మర్చెంట్స్, చిక్ బళ్ళాపూర్ పర్యవేక్షకులు సి. మధుసూదన్‌రెడ్డికి సోమవారం అందజేశారు. సుమారు రూ. 2లక్షల విలువ చేసే 18 రకాల కూరగాయలను ధాతలు అందజేశారు.

నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

వాలీబాల్ టోర్నమెంట్ విజేత బనగానపల్లె జట్టు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని శెట్టివీడు గ్రామంలో మార్థోమా చర్చి 26వ వార్షికోత్సవం సందర్భంగా 2 రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో బనగానపల్లె పట్టణానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో బాచేపల్లె జట్టు, మూడవ స్థానంలో మైదుకురు జట్లు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7.500లు, మూడవ బహుమతి రూ.5 వేల నగదును దాతలు వైసీపీ నాయకులు చిన్న భికారి, టిఎన్ మహబూబ్ బాషలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తలారి నరసింహ్ముడు, షాలోమ్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి భక్తుల విరాళాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి సికింద్రాబాద్ వాస్తవ్యులు జి.బంగారరావు, రూ.1,01,116/-లను సోమవారం విరాళంగా అందజేశారు. అలాగే మరో భక్తులు హైదరాబాద్ వాస్తవ్యులు ఎం. దీపిక శాశ్వత అన్నప్రసాద పథకానికి రూ.1,01,116/- విరాళంగా పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. అనంతరం దాతలకు అధికారులు శ్రీస్వామివార్ల శేషవస్త్రాలతో సత్కరించి, లడ్డూ ప్రసాదాలను, శ్రీస్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

నకిలీ విత్తనాల పంటల నమూనాలను సేకరించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - రుద్రవరం

వ్యవసాయ రైతులు నకిలీ విత్తనాలతో నాటిన వరి పంటను పరిశీలించి వాటి నమూనాలను సేకరించినట్లు జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. సోమవారం మండలంలోని చిన్న కంబలూరు గ్రామ రైతులు వరి విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేసి పంటలో కల్తీ కనబడడంతో వారి ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతుల పొలాలను సందర్శించి శాంపిల్స్ సేకరించామన్నారు. వీటికి సంబంధించిన రిపోర్టులను మండల వ్యవసాయ అధికారికి త్వరలోనే తెలియజేస్తామన్నారు. శాస్త్రవేత్తలు రామకృష్ణ రావు, రవికుమార్, గాయత్రి, విస్తరణ అధికారి రాజు, రైతు సేవ కేంద్ర సిబ్బంది చాణిక్యుడు, నవీన్ కుమార్ రెడ్డి, రేష్మ, శివకృష్ణ, నాగ ఫణీంద్ర కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వరి పంటలో నమూనాలను సేకరిస్తున్న శాస్త్రవేత్తలు

నేడు సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కళాజాతా జయప్రదం కోసం మంగళవారం కెకె భవన్‌లో ఉదయం 10.30 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి యూనియన్ జిల్లా కార్యదర్శి సునియా కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరులో ఈనెల 16 నుంచి 19 వరకు జరుగునున్న సౌత్ సెంట్రల్ జోన్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 13వ మహాసభల సందర్భంగా ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కళాజాతా ఈనెల 13న కర్నూలుకు వస్తున్నట్లు తెలిపారు. కళాజాతా జయప్రదం కోసం ఈనెల 5న జరిగే సన్నాహక సమావేశానికి సిఐటియు అనుబంధ ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కడప నంద్యాల జిల్లాలకు చెందిన ఎంఇఒలు పాఠశాల ప్రధానోపాధ్యాయులుకు సోమవారం కర్నూలు నగరి శివారులోని ఓ కళాశాలలో ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ అమ్మినాయుడు పాల్గొని మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న మేడ్ రాష్ట్ర , జిల్లా నాయకులు

7న 'మేడ్ ' రాష్ట్ర మహా సభలు

పోస్టర్ ఆవిష్కరణ చేసిన నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మోడల్ అసోసియేషన్ ఫర్ దలిత్ ఎంప్లాయర్స్ (మేడ్) కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు బెన్నెమ్మ ఆధ్వర్యంలోఎస్, ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, క్వాలిటీ కంట్రోల్ విజిలెన్ ఎఇ హరిదాస్ ఈరన్న మేడ్ 7వ రాష్ట్ర మహా సభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిదాస్ ఈరన్న మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో , తెలంగాణ రాష్ట్రంలో కూడా మేడ్ దళిత ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారం చేయుటలో నిరంతరం శ్రమించి,, ప్రభుత్వంతో సత్సంబంధం కొనసాగిస్తుందన్నారు. దళిత కుటుంబాలకు కూడా ఆసరగా ఉంటుందన్నారు. ఇటీవల రాష్ట్రంలో వచ్చిన వరదలసమయంలో మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ సాహసోపేతంగా వరదల్లో దళిత కుటుంబాలకు ఆర్థికసాయం, సరుకులు సరఫరా చేశారన్నారు. ఇది మేడ్ సేవానిరతికి నిదర్శనం అన్నారు. జిల్లా అధ్యక్షులు బెన్నెమ్మ మాట్లాడుతూ ఈ నెల 9న గుంటూరులో నిర్వహించే 7వ రాష్ట్ర మహాసభలకు, కర్నూల్ జిల్లా నుండి దళిత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారను. మేడ్ రాష్ట్ర కన్వీనర్ రాజ్యలక్ష్మి ,కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి , తెలంగాణాస్టేట్ లీగల్ అడ్వయిజర్, సుమనరాణి , కాంకర్ గ్రూప్ అఫ్ కాలేజెస్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ , మేడ్ కర్నూల్ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

యురేనియంపై సీఎం స్థాయిలో నిర్ణయం

మీడియాతో మాట్లాడుతున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి /కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాలపై సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని కర్నూలు జిల్లా ఇన్చార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం ఆయన కర్నూలులో విస్తృతంగా పర్యటించారు. ఉదయం కర్నూలు వ్యవసాయ మార్కెట్ లో పర్యటించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, దళారీ వ్యవస్థ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యేలతో సమావేశమై జిల్లాలోని పలు సమస్యల గురించి చర్చించారు. ఆ తర్వాత మౌర్య ఇన్ హోటల్లో నిర్వహించిన ఎన్‌డిఎ కూటమి నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో యురేనియం తవ్వకాలపై ఆందోళనలు మీడియాలో వస్తున్నాయని, ఏ పని చేసినా ప్రజల ఆమోదంతోనే చేస్తామని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసే ప్రభుత్వమని అన్నారు. ప్రజలకు నష్టం జరిగే ఏ పనీ ఈ ప్రభుత్వం చేయదన్నారు. గత ప్రభుత్వం మాదిరి నియంతృత్వ ప్రభుత్వం కాదని, అరెస్టులు నిర్బంధాలు బారికేడ్లు లేని ప్రభుత్వమని చెప్పారు. గత ప్రభుత్వం 2022లో యురేనియం సర్వేకు అనుమతిచ్చిందని, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ఇప్పుడు మరొకలా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం యురేనియం వ్యవహారం సర్వేకే పరిమితం అవుతుందని వెల్లడించారు. యురేనియం తవ్వకాలపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకుంటా మన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా గత ప్రభుత్వం పెట్టలేదని దీంతో ఇరిగేషన్ వ్యవస్థ 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని తెలిపారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 1800 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెంచేలా బడ్జెట్ లో రూ.2500 కోట్లు మంజూరుకు సీఎం అంగీకరించారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల గుండ్రేవుల, ఆర్డీఎస్ పనులు ప్రారంభించలేదన్నారు. పలు ప్రాజెక్టుల ఆధునీకరణ కూడా చేపట్టలేదని, సాగు, తాగునీరు అందించేలా ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి కర్నూలు జిల్లా ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తామని తెలిపారు. అలగనూరు రిజర్వాయర్ బండ్లు పునర్నిర్మానం చేయకుండా గాలికి వదిలేసారన్నారు. రోడ్లన్నీ అధ్వానంగా ఉన్న పరిస్థితుల్లో రూ.800 కోట్లు మంజూరు చేశారని, సంక్రాంతి లోపు గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఉచిత ఇసుక సమర్థవంతంగా ప్రజలకు అందించేలా అధికారులు పనిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సచివాలయ కార్యదర్శి నుంచి లేఖ తీసుకెళ్తే ఇబ్బంది పెట్టద్దని, అదే సమయంలో అక్రమ రవాణా చేస్తే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

టిడ్కో ఇళ్లకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని, ఆ ఇల్లు తాకట్టు పెట్టిన జగన్ కు రాజకీయాలు మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. కృష్ణా నది నుండి మల్యాల ద్వారా హంద్రీనీవాకు నీళ్ళు తీసుకొచ్చినప్పుడే రైతులకు సమృద్ధిగా నీళ్ళు అందించేందుకు వీలు ఉంటుందని తెలిపారు. నాలుగు నెలల్లో లైనింగ్ పనులు పూర్తి చేసి సీజన్‌కు నీళ్ళు ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి పొలిటికల్ గవర్నెన్స్ పాలన కొనసాగిస్తామంటున్నారన్నారు. కొంతమంది అధికారులు ప్రజాప్రతినిధుల ఆదేశాలను ఖాతర్ చేయకుండా పోతున్నారన్నారు. కూటమి పక్షం తన గెలుపులో కీలకంగా వ్యవహరించిందని అన్నారు. అడిగి పని చేయించుకునే అధికారం కూటమి పక్షానికి ఉందన్నారు. నిబంధనలు కనుగుణంగా ఉన్నవి తప్పకుండా పనులు చేసి పెడతామన్నారు. ఎన్ని పరిశ్రమకులకు ఏర్పాటుకు అవకాశం ఉంటే అన్నింటిని మొదట కర్నూలులోనే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. పెన్షన్ల పంపిణీలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జి.బిందు మాధవ్, టీడీపీ జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, బిజెపి జిల్లా అధ్యక్షులు కనిగిరి నీలకంఠ, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చింతా సురేష్, ఎంపి బస్తిపాటినాగరాజు, ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, గౌరుచరితరెడ్డి, కెఇ.శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, పార్థసారధిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇన్చార్జి వీరభద్ర గౌడ్, టిడిపి కోడుమూరు ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, టిడిపి నగర అధ్యక్షులు నాగరాజు, పలువురు నియోజకవర్గ మండల ఇన్చార్జిలు పాల్గొన్నారు.

యురేనియం అనుమతి రద్దు చేయాలని మంత్రికి వినతి

కప్పట్రాళ్ల పరిధిలోని యురేనియం తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు యురేనియం వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. యురేనియం తవ్వకాలు జరగకుండా చూసి తమ ప్రాణాలను కాపాడాలని కోరారు. మంత్రి స్పందిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.